# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను
http://vaasthavanestham.com
వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక
సంప్రదించండి
తెలంగాణ 8099779988
ఆంధ్రప్రదేశ్ 9985337979
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో
వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన
• జిల్లా బ్యూరో చీఫ్‌లు
• జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు
• నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
• మండల రిపోర్టర్లు కావలెను




సంపుటి : 2 సంచిక : 292 సోమవారం 27 మే 2024 పేజీలు : 8 వెల : 5/-
Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# కాంగ్రెస్ కొత్త సారథి ఎవరు?

## అధిష్టానం వద్ద క్యూ కడుతున్న చాలా మంది నేతలు

- లోక్ సభ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో టీపీసీసీ చీఫ్ గా సీఎం రేవంత్ రెడ్డినే కొనసాగించింది కాంగ్రెస్ అధిష్టానం.
- ముందుగా డిప్యూటీ సీఎంగా ఉన్న భట్టి విక్రమార్క కూడా టీపీసీసీ చీఫ్ రేసులో ఉన్నట్లు సమాచారం
- ఈ జాబితాలో వినిపిస్తున్న మరో పేరు పొన్నం ప్రభాకర్





హైదరాబాద్

తెలంగాణలో టీపీసీసీ పదవి రేసులో చాలా మంది నేతలు అధిష్టానం వద్ద క్యూ కడుతున్నారు. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రితో పాటు టీపీసీసీ అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తెలంగాణలో టీపీసీసీ అధ్యక్ష పదవిపై చాలా మంది నేతలు గంపెడు ఆశలు పెట్టుకున్నారు. మొన్నటి వరకు తెలంగాణలో లోక్ సభ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో టీపీసీసీ చీఫ్ గా సీఎం రేవంత్ రెడ్డినే కొనసాగించింది కాంగ్రెస్ అధిష్టానం. పైగా పార్లమెంట్ ఎన్నికల్లో మొత్తం 17 స్థానాలకు గానూ 14 నియోజకవర్గాల్లో విజయం సాధించాలని టార్గెట్ ఇచ్చినట్లు వార్తలు వినిపించాయి. దీంతో అన్నీతానై ప్రచార బాధ్యతలు నిర్వహించారు సీఎం రేవంత్ రెడ్డి. ఇక ఆ ఎన్నికలు ముగిసి 10 రోజులు గడిచిపోయింది. ఎన్నికల ఫలితాలు కూడా జూన్ 4న రానున్నాయి. ఈ తరుణంలో కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుని పదవీ బాధ్యతల నుంచి సీఎం రేవంత్ నిష్క్రమించే అవకాశం ఉంది. ఇకపై కేవలం పరిపాలనా సంబంధిత విషయాలపైనే ఎక్కువ ఫోకస్ పెట్టనున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ ఖాళీ అయ్యే పదవి రేసులో అరడజనుకు పైగా నేతలపేర్లు వినిపిస్తున్నాయి. ముందుగా డిప్యూటీ సీఎంగా ఉన్న -మిగతా3లో

# బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కై మాట్లాడుతున్నారు



- సన్న బియ్యం మీరు ఎంత ఇస్తే అంతా కొంటాం..
- మహేశ్వర రెడ్డిని మేమే పెంచి పోషించాం: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- మేము అధికారంలోకి వచ్చే నాటికి సివిల్ సప్లైస్ పరిస్థితి అస్తవ్యస్తంగా ఉంది
- డీఫాల్డ్ చేసే మిలర్లకు మళ్లీ ధాన్యం ఇవ్వడం లేదు
- సివిల్ సప్లైస్ రూ.11 వేల కోట్ల నష్టాల్లోఉంది
- మిల్లర్లపై చర్యలు తీసుకుంటే అవినీతి ఆరోపణలు చేస్తున్నారు
- డిఫాల్టర్ రైస్ మిల్లర్ల కోసమే బీఆర్ఎస్, బీజేపీ మాట్లాడుతోంది..

హైదరాబాద్

బీజేపీ ఫ్లోర్ లీడర్ మహేశ్వర రెడ్డిపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనను తామే పెంచి పోషించామని అన్నారు. ఆయన అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని విమర్శించారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని ఓవర్ టేక్ చేయాలని మహేశ్వర రెడ్డి భావిస్తున్నారని అన్నారు. బీజేపీలో ఓవర్ స్పీడ్‌గా పోవాలని ఆయన అనుకుంటున్నాడన్నారు. ఢిల్లీకి డబ్బులు పంపి ఫ్లోర్ లీడర్ పదవి ఆయనే కొనుక్కున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. ఆదివారం ఆయన గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, నేను వెయ్యి కోట్లు తీసుకున్నానని.. నీచపు మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. "వినతి పత్రాలు తెచ్చి.. లోపలికి వెళ్లి భూములు సెటిల్‌మెంట్ మాట్లాడినట్టు కాదు. మేము అధికారంలోకి వచ్చే నాటికి సివిల్ సప్లైస్ పరిస్థితి అస్తవ్యస్తంగా ఉంది, డీఫాల్ట్ చేసే మిలర్లకు మళ్లీ ధాన్యం ఇవ్వడం లేదు. డీఫాల్ట్ మిల్లర్లతో బీజేపీ, బీఆర్ఎస్ నేతలు -మిగతా3లో



# హైదరాబాద్ వాసులకు అలెర్ట్

- హైదరాబాదులో పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో వర్షం
- గత కొన్ని రోజులుగా హైదరాబాదులో తీవ్ర ఎండలు
- ఉదయం నుంచి ఎండ వేడిమి
- సాయంత్రానికి మారిన వాతావరణం

హైదరాబాద్

గత కొన్ని రోజులుగా తీవ్ర ఎండలతో ఇబ్బంది పడుతున్న హైదరాబాద్ వాసులకు ఈ సాయంత్రం కురిసిన వర్షం ఉపశమనం కలిగించింది. నగరంలో సాయంత్రం వరకు ఎండ మండిపోగా, సాయంత్రానికి వాతావరణంలో మార్పు వచ్చింది. హైదరాబాదులోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఉప్పల్, దిల్ సుఖ్ నగర్, వనస్థలిపురం, సరూర్ నగర్, ఎల్బీ నగర్, నాచారం, హబ్సీగూడ, తుర్కయాంజాల్, నల్లకుంట, కాచిగూడ, మల్కాజ్ గిరి, హయత్ నగర్, పెద్ద -మిగతా3లో

# పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్‌కు సర్వం సిద్ధం

- ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్
- అన్ని జిల్లా కేంద్రాల్లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఏర్పాటుచేసి సిబ్బందికి 32 రకాల పోలింగ్ సామాగ్రిని అందజేత
- పోలింగ్ స్టేషన్లకు జంబో, మిని బ్యాలెట్ బాక్స్‌ల తరలింపు
- పోలింగ్ రోజు ఉదయం 6 నుంచి రాత్రి 8గంటల వరకు 144 సెక్షన్ అమలు



హైదరాబాద్

ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలిం గ్‌కు సర్వం సిద్ధమైంది. సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ఏర్పాట్లను అధికారులు పూర్తిచేశారు. అన్ని జిల్లా కేంద్రాల్లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను -మిగతా3లో




## ఆధార్'పై రూమర్లు .. క్లారిటీ ఇచ్చిన 'ఉడాయ్'

- జూన్ 14 లోపు పౌరులు తమ వ్యక్తిగత వివరాలు అప్‌డేట్ చేయకపోతే ఆధార్ పని చేయదంటూ ప్రచారం
- ఈ పుకార్లను కొట్టిపారేసిన భారత విశిష్ట గుర్తింపు ప్రాధికారిక సంస్థ(ఉడాయ్)
- పదేళ్లు పూర్తయిన వారు వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని ఉడాయ్ గతంలో సూచన

# తెలంగాణలో కుంభకోణాల కుంభమేళా జరుగుతోంది

- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ధ్వజం
- గల్లీలో దోచుకో.. ఢిల్లీలో ఉండే కాంగ్రెస్ పెద్దలకు ఇచ్చుకో అన్నట్లుగా ఉంది
- బీఆర్ఎస్ అంటే స్కీమ్‌లు.. కాంగ్రెస్ అంటే స్కామ్‌లు
- నిజానికి కాంగ్రెస్ అంటేనే స్కాం..గ్రెస్
- రాష్ట్రంలో బీ ట్యాక్స్ అని.. ఆర్ ట్యాక్స్ అని.. ఆర్ఆర్ ట్యాక్స్ అని.. యూ ట్యాక్స్ అని ట్యాక్స్‌ల గురించి వింటున్నాం
- ఈ స్కాంలో మాత్రం కేవలం తెలంగాణలోని కాంగ్రెస్ పెద్దలకే కాకుండా ఢిల్లీ పెద్దల దాకా కూడా హస్తం ఉందని తమకు సమాచారం



హైదరాబాద్

కాంగ్రెస్ వస్తే తెలంగాణలో కుంభకోణాల కుంభమేళా జరుగుతుందని ఎన్నికలకు ఆరు నెలల ముందు నుంచే చెబుతున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తు చేశారు. గల్లీ మే లూటో.. ఢిల్లీ మే బాంటో.. అంటే గల్లీలో దోచుకో.. ఢిల్లీలో ఉండే కాంగ్రెస్ పెద్దలకు ఇచ్చుకో అన్నట్లుగా ఉందన్నారు. ఇవాళ రైతన్నల ధాన్యం నుంచి విద్యార్థుల అన్నం వరకు అన్నింటి మీద కుంభకోణాలకు కాంగ్రెస్ పార్టీ తెరలేపిందని అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం -మిగతా3లో

# జమ్మూకశ్మీర్ విషయంలో చేయబోయేది అదే..

ఆర్టికల్ 370 రద్దు నాటి నుంచి రాష్ట్రపతి పాలనలో ఉన్న జమ్మూకశ్మీర్ ప్రాంతానికి త్వరలోనే రాష్ట్ర హోదా కల్పిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. లోక్ సభ ఎన్నికల ఆరో విడతలో భాగంగా జమ్మూకశ్మీర్ లోని ఎంపీ స్థానాలకు ప్రశాంతంగా ఎన్నికలు పూర్తయ్యాయని ఆయన తెలిపారు. తమ ప్రభుత్వం కశ్మీర్ విషయంలో అనుసరించిన విధానం సరైనదేనని ఇది నిరూపిస్తోందని చెప్పారు. ఇది ఎన్డీయే ప్రభుత్వం సాధించిన అతి పెద్ద విజయమని వ్యాఖ్యానించారు.

**ఇంటర్వ్యూలో మాట్లాడుతూ..**

లోక్ సభ ఎన్నికల ఆరో విడత పోలింగ్ పూర్తయిన నేపథ్యంలో అమిత్ షా తాజాగా ప్రముఖ వార్తాసంస్థ పీటీఐకి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా జమ్మూ కశ్మీర్ కు సంబంధించిన అంశాలపై మాట్లాడారు. జమ్మూ కశ్మీర్ లో లోక్ సభ



ఎన్నికలు ప్రశాంతంగా జరగడంపై హర్షం వ్యక్తం చేశారు.

**ఇది అతిపెద్ద విజయం**

లోక్ సభ ఎన్నికల్లో కశ్మీర్ లోని వేర్పాటు వాదులు కూడా పెద్ద ఎత్తున పాల్గొని ఓటు వేశారని.. అత్యధిక పోలింగ్ శాతం నమోదైందని అమిత్ షా చెప్పారు. ఇది చాలు ముఖ్యమైన పరిణామమని అభివర్ణించారు. జమ్మూ కశ్మీర్ ప్రాంతంలో ప్రశాంతంగా, అత్యధిక స్థాయిలో పోలింగ్ జరగడమనేది మోదీ ప్రభుత్వం సాధించిన పెద్ద విజయమన్నారు. తమ ప్రణాళిక ప్రకారం.. జమ్మూకశ్మీర్ లో అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన సర్వేలు జరుగుతున్నాయని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ ఏడాది సెప్టెంబరు 30 నాటికి జమ్మూ కశ్మీర్ కు అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు.

**బీజేపీని బలోపేతం చేస్తున్నాం..**

ఇటీవలి లోక్ సభ ఎన్నికల్లో జమ్మూ కశ్మీర్ లో బీజేపీ అభ్యర్థిని బరిలోకి దింపకపోవడానికి పలు కారణాలు ఉన్నాయని చెప్పారు. తమ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టామని.. భవిష్యత్తులో తమ అభ్యర్థులను పోటీకి పెడతామని తెలిపారు.

# ఒక ప్రధాని మాట్లాడాల్సిన భాషేనా ఇది?

**పాట్నా:** విపక్షాలను టార్గెట్ చేస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బీహార్‌లో చేసిన "ముజ్రా" డాన్స్ వ్యాఖ్యలపై ఆర్జేడీ నేత, బీహార్ మాజీ ముఖమంత్రి తేజస్వి యాదవ్ స్పందించారు. "ఒక ప్రధానమంత్రి మాట్లాడాల్సిన భాషేనా ఇది?" అని నిలదీశారు. ప్రజల ముందు ప్రధాని తప్పుడు, నిరాధార ప్రకటనలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. ఈమేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆయన ఒక లేఖ రాశారు.

ప్రధాని ఎంచుకుంటున్న భాషను ఆ లేఖలో తేజస్వి తప్పు పడుతూ.. "ఇవాళ మీరు బీహార్ వచ్చారు. చేయగలిగినన్ని తప్పుడు, నిరాధార ఆరోపణలు చేశారు. మీరు ప్రధాన పదవికి ఏమాత్రం గౌరవం ఇవ్వదలచుకోలేదనే విషయం మీ మాటాల్లో చాలా స్పష్టంగా అర్థమవుతోంది. ముజ్రా, మంగళసూత్ర వంటి వ్యాఖ్యల ద్వారా మీరు దేశ సమున్నత గౌరవాన్ని కించపరుస్తున్నారు. ఈ తరహా భాష మాట్లాడటం సరైనదో కాదో మీరే నిర్ణయించుకోవాలి" అని అన్నారు.

ప్రైవేటురంగంలో రిజర్వేషన్లపై నిర్లక్ష్యం..

ప్రైవేటురంగంలో రిజర్వేషన్ల అంశాన్ని మోదీ నిర్లక్ష్యం చేస్తున్నారని ఆ లేఖలో తేజస్వి విమర్శించారు. "బాబాసాహెబ్ అంబేద్కర్ రిజర్వేషన్లకు చరమగీతం పాడేందుకు మోదీ వినూత్న మార్గంలో వెళ్తున్నారు. ఎందుకంటే రాజ్యాగంలోని 5,6 సెక్షన్ల కింద రిజర్వేషన్లు కేటాయించడం జరుగుతుంది. మీరు రైల్వేలు, ఆర్మీ, ఇతర శాఖల్లో ప్రభుత్వ ఉద్యోగాలను



రద్దు చేస్తే, రిజర్వేషన్ ఉద్దేశమే తుడిచిపెట్టుకు పోతుంది. అయితే ఈ సీరియస్ అంశం మీ ప్రాధాన్యతాక్రమాల్లో లేదు. ప్రైవేటు సెక్టార్‌లో రిజర్వేషన్లు కల్పించాలని, తద్వారా బహుజనులకు, దళితులు, ఇతర బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాంగ కల్పించిన హక్కులు లభిస్తాయని మేము అనేక మార్లు పార్లమెంటులోను, రోడ్లపైన, అసెంబ్లీలోనూ మీకు విజ్ఞప్తులు చేశాం" అని తేజస్వి గుర్తు చేశారు. బాబాసాహెబ్, బిర్సా ముండా, కాన్షీరాం, మండల్ కమిషన్‌కు బీజేపీ సైద్ధాంతిక శత్రువనే విషయం దళితులు, ఓబీసీలు, గిరిజనులకు బాగా తెలుసునని తేజస్వి అన్నారు. అవునో కాదో మోదీ చెప్పాలని కోరారు. "గుజరాత్‌లో ఓబీసీ కేటగిరిలో ఉన్న ముస్లింల లిస్ట్‌ను ఈ లేఖతో నేను జత చేస్తున్నాను. గుజరాత్‌లోని ముస్లిం కమ్యూనిటీ రిజర్వేషన్ పొందిన విషయం బహుశా మీరు మరిచిపోయి ఉంటారు. 43 ఏళ్లకు పైగా గుజరాత్‌కు ముఖ్యమంత్రిగా పనిచేసిన మీరు గందరగోళ, విద్వేష రాజకీయాలకు స్వస్తి చెప్పాలి" అని తేజస్వి ఆ లేఖలో సూచించారు.

**దళిత వ్యతిరేక భావజాలం..**

ప్రధాన మంత్రి మోదీ దళిత వ్యతిరేక భావజాలంతో వ్యవహరిస్తున్నారని తేజస్వి ఆ లేఖలో ఆరోపించారు. "బీహార్‌లో మేము ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పుడు రాష్ట్ర ప్రభుత్వ ఖర్చులతో కులగణన చేపట్టాం. దీనిపై వాస్తవం ఏమిటో మీకు తెలుసు. సర్వే వివరాల ఆధారంగా రిజర్వేషన్ పరిధిని మేము 75 శాతానికి పెంచుతూ, దీనిని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చమని పదేపదే ముకుళిత హస్తాలతో మిమ్మల్ని వేడుకున్నాం. కానీ, మీరు సహజంగానే వెనుకబడిన, దళిత వ్యతిరేక భావజాలంతో మా విజ్ఞప్తిని కనీసం పరిశీలనార్థంగా కూడా భావించలేదు" అని మోదీకి రాసిన లేఖలో తేజస్వి పేర్కొన్నారు.

# రూ.80 వేల కోట్ల పరిహారం పెండింగ్..
# 10.46 లక్షల మంది నిరీక్షణ

**ఢిల్లీ:** దేశవ్యాప్తంగా నిత్యం ఏదో ఓ చోట రహదారులు నెత్తురోడుతూనే ఉన్నాయి. తాజాగా ఉత్తరప్రదేశ్‌లోని లఖింపుర్‌ఖేరి వద్ద ఆగి ఉన్న బస్సును ట్రక్కు ఢీ కొట్టడంతో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో తీవ్రంగా గాయపడ్డారు. ఇలా నిత్యం ఏదో చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. బాధితులకు అందజేసే ప్రమాద క్లెయిమ్‌లు సమయానికి అందుతున్నాయా లేదా అనే విషయంలో స్పష్టత కోరుతూ ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు న్యాయవాది కేసీ జైన్ ఆర్టీఐకి దరఖాస్తు చేశారు. దేశంలో పెండింగ్‌లో ఉన్న మొత్తం మోటారు ప్రమాద క్లెయిమ్‌ల సంఖ్యను రాష్ట్రం, జిల్లాల వారీగా ఇవ్వాలని రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వ శాఖని కోరారు. జైన్ దరఖాస్తుపై స్పందించిన ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా 2018 నుంచి 2023 వరకు పెండింగ్‌లో ఉన్న మోటారు ప్రమాద క్లెయిమ్‌ల సంఖ్యను వెల్లడించింది. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు రూ. 80,455 కోట్ల విలువైన 10,46,163 మోటారు ప్రమాద క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయని, 2018 - 23 మధ్య వాటి సంఖ్య మరింతగా పెరిగిందని ఆర్టీఐ నివేదిక పేర్కొంది.

**ఆర్థిక సంవత్సరం క్లెయిమ్‌ల సంఖ్య**

2018-19 - 9,09,166
2019-20 - 9,39,160
2020-21 - 10,08,332
2021-22 - 10,39,323
2022-23 - 10,46,163

క్లెయిమ్‌ల మొత్తం ఇప్పటివరకు రూ.80,455 కోట్లకు చేరుకుంది. ఇంత భారీ మొత్తంలో క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉండటంపై జైన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌ల సంఖ్య ఏటా పెరుగుతోందని.. రోడ్డు ప్రమాదాలలో మరణించిన, గాయపడిన వ్యక్తులపై ఆధారపడిన వారి




క్లెయిమ్‌ల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతోందని అన్నారు. క్లెయిమ్ సెటిల్‌మెంట్ల వేగాన్ని పరిశీలిస్తే.. 2022-23 ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్య 10,39,323 కాగా, 2024నాటికి కొత్త క్లెయిమ్‌ల సంఖ్య 4,54,944కి చేరింది. అలా మొత్తం పెండింగ్ క్లెయిమ్‌ల సంఖ్య14,94,267.

వీటిలో ఇప్పటివరకు 4,48,104 కేసులు మాత్రమే పరిష్కరించారు. ఇది మొత్తం కేసులలో 29 శాతం మాత్రమే కావడం గమనార్హం. క్లెయిమ్ సెటిల్ చేయడానికి ఒక్కొక్కరికి సగటున 4 సంవత్సరాలు పడుతుందని అంచనా. మోటారు యాక్సిడెంట్ క్లెయిమ్‌ల తీర్పులో విపరీతమైన జాప్యం నేపథ్యంలో రోడ్డు ప్రమాదాల పరిహారం మధ్యంతర చెల్లింపును డిమాండ్ చేస్తూ రిట్ పిటిషన్ (సివిల్) కింద సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు జైన్ తెలిపారు. బాధితులకు ఉపశమనం లభించేలా మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 164 కింద కేంద్ర ప్రభుత్వం ఓ పథకాన్ని రూపొందించాలి. చట్టంలోని సెక్షన్ 164 ప్రకారం రోడ్డు ప్రమాదంలో మరణిస్తే రూ. 5 లక్షలు.. గాయాల కేసులకు రూ. 2,50,000 పరిహారం ఇవ్వాలి. కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకుని బాధితుల క్లెయిమ్‌లను పరిష్కరించాలని కేసీ జైన్ కోరారు.

# 'ముజ్రా' డాన్స్ ఇక్కడే జరిగిందా?.. మోదీ వ్యాఖ్యలపై ఖర్గే

**సాసారామ్:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విపక్ష నేతలను ఉద్దేశించిన చేసిన 'ముజ్రా' డాన్స్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. బీహార్ ప్రజలను మోదీ అవమానిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ నేత, మహాఘట్‌బంధన్ అభ్యర్థి మనోజ్ కుమార్ తరఫున బీహార్‌లోని సాసారామ్ లోక్‌సభ నియోజకవర్గంలో ఆదివారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఖర్గే మాట్లాడుతూ, ముజ్రా డాన్స్ ఇక్కడే జరిగినట్టు ప్రధాని మాట్లాడటం బీహార్ ప్రజలను మోదీ అవమానించడమేనని అన్నారు. శుక్రవారంనాడు బీహార్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో మోదీ "ముజ్రా" వ్యాఖ్యలు చేశారు.



**ఆయన మాస్టర్ కాదు, డిక్టేటర్..**


ప్రధానమంత్రి తనను తాను ఒక మాస్టర్ (తీస్మార్‌ఖాన్) అనుకుంటున్నారని, చాలా తప్పుడు అభిప్రాయంలో ఆయన ఉన్నారని, ప్రజలే మాస్టర్లని, ఆయన ఒక నియంత అని ఖర్గే విమర్శలు గుప్పించారు. మోదీ మూడోసారి ప్రధానమంత్రి అయితే ప్రజల గొంతు అణిచివేస్తారని హెచ్చరించారు. ఈ ఎన్నికలు ప్రజలకు, మోదీకి మధ్య జరుగుతున్న ఎన్నికలని, రాహుల్‌కు మోదీకి మధ్య జరుగుతున్న ఎన్నికలు ఎంతమాత్రం కావని ఖర్గే తెలిపారు. ప్రధాని సంపన్నులను అక్కున చేర్చుకుంటారే కానీ పేద ప్రజలను కాదని అన్నారు. బీహార్‌లోని సాసారామ్, నలందా, పాట్నా సాహిబ్, పాటలీపుత్ర, అర్రా, బక్సర్, కరకాట్, జెహ్నాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల్లో జూన్ 1వ తేదీన ఏడవ విడత ఎన్నికల్లో భాగంగా పోలింగ్ జరుగనుంది.

## గ్రాడ్యుయేషన్ పట్టా అందుకున్న గౌతమ్...
## పుత్రోత్సాహంతో పొంగిపోతున్న మహేశ్ బాబు

**విదేశాల్లో గౌతమ్ ఉన్నత విద్యాభ్యాసం**

**విజయవంతంగా గ్రాడ్యుయేషన్ పూర్తి**

**కుమారుడి కాన్వొకేషన్ కార్యక్రమానికి హాజరైన మహేశ్ బాబు**



టాలీవుడ్ సూపర్ స్టార్ మహేశ్ బాబు తనయుడు గౌతమ్ విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా గౌతమ్ కు గ్రాడ్యుయేషన్ పూర్తయింది. కాన్వొకేషన్ కార్యక్రమంలో గ్రాడ్యుయేషన్ పట్టా అందుకున్నాడు. తనయుడి ఘనత పట్ల మహేశ్ బాబు సంతోషం వ్యక్తం చేశారు. "నా హృదయం గర్వంతో ఉప్పొంగిపోతోంది. నువ్వు విజయవంతంగా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినందుకు కంగ్రాచ్యులేషన్స్ గౌతమ్. తదుపరి అధ్యాయం నీ కోసం ఎదురుచూస్తోంది. అందులో కూడా నువ్వు మరింత ప్రకాశవంతంగా వెలిగిపోతావని నాకు నమ్మకం ఉంది. నీ కలల సాకారం కోసం నిత్యం కృషి చేస్తూ ఉండు. ఎప్పటికీ నిన్ను ప్రేమించే వాళ్లు ఉన్నారన్న విషయం గుర్తుపెట్టుకో. ఓ తండ్రిగా ఇవాళ నేను పుత్రోత్సాహంతో గర్విస్తున్నాను" అంటూ మహేశ్ బాబు ఇన్‌స్టాగ్రామ్ లో స్పందించారు. అంతేకాదు, తనయుడు గౌతమ్ కాన్వొకేషన్ కార్యక్రమానికి హాజరైనప్పటి ఫొటోలు కూడా పంచుకున్నారు.

## ఆధార్'పై రూమర్లు .. క్లారిటీ ఇచ్చిన 'ఉడాయ్'




**న్యూఢిల్లీ:** ఆధార్‌పై సోషల్ మీడియాలో ఇటీవల ఒక చర్చ విస్తృతంగా జరుగుతోంది. జూన్ 14 లోపు పౌరులు తమ వ్యక్తిగత వివరాలు అప్‌డేట్ చేయకపోతే ఆధార్ పని చేయదంటూ ప్రచారం జరుగుతోంది. ఈ పుకార్లను భారత విశిష్ట గుర్తింపు ప్రాధికారిక సంస్థ(ఉడాయ్) కొట్టిపారేసింది. ఆధార్‌లో కేవలం ఉచితంగా వివరాలు అప్‌డేట్ చేసుకోవడానికి మాత్రమే జూన్14 గడువని తెలిపింది. వివరాలు అప్‌డేట్ చేసుకోకపోయినా ఆధార్‌కార్డు పనిచేస్తుందని స్పష్టం చేసింది. అయితే ఆ తర్వాత ఆధార్ కేంద్రాలకు వెళ్లి ఛార్జీలు చెల్లిస్తే సరిపోతుందని వివరించింది. కాగా, ఉచితంగా ఆన్‌లైన్‌లో ఆధార్ వివరాలు అప్‌డేట్ చేసుకునేందుకు ఉడాయ్ తొలుత 2023 డిసెంబర్ 14 వరకు అవకాశం ఇచ్చింది. తర్వాత ఈ గడువును రెండుసార్లు జూన్ 14 వరకు పొడిగించింది. ఈలోపు ఆన్‌లైన్‌లో తగిన పత్రాలు సమర్పించి ఉచితంగా వివరాలు అప్‌డేట్ చేసుకోవచ్చు. ఆధార్ కార్డు కోసం పేరు నమోదు చేసుకున్న నాటి నుంచి పదేళ్లు పూర్తయిన వారు వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని ఉడాయ్ గతంలో సూచించింది.

## ఫేక్ కరెన్సీని ఇలా ఈజీగా గుర్తించవచ్చు!

**భారత్ లో సుదీర్ఘకాలంగా నకిలీ నోట్ల బెడద**

**2016లో పెద్ద నోట్ల రద్దుకు నకిలీ కరెన్సీ కూడా ఓ కారణం**

**ఒరిజినల్ నోట్లపై అనేక సెక్యూరిటీ ఫీచర్లు పొందుపరిచిన ఆర్బీఐ**

భారత్ ను తీవ్రంగా వేధించే అంశాల్లో నకిలీ నోట్ల బెడద ఒకటి. ఒక్కోసారి ఫేక్ కరెన్సీ నోట్లకు, అసలు కరెన్సీ నోట్లకు తేడాలు గుర్తించలేక మోసపోయేవాళ్లు చాలామంది ఉంటారు. భారత్ లో 2016లో కేంద్ర ప్రభుత్వం పెద్ద నోట్ల రద్దు చేయడానికి ఈ ఫేక్ కరెన్సీ అంశం కూడా ఓ కారణం. అయితే, ఇప్పటికీ చాలా మంది ఫేక్ కరెన్సీ నోట్లను గుర్తించలేకపోతుంటారు. ఒరిజినల్ కరెన్సీ నోట్లలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అలాంటి అనేక సెక్యూరిటీ ఫీచర్లు పొందుపరుస్తుంది. ఆ ఫీచర్లపై పూర్తిగా అవగాహన లేని వాళ్ల కోసమే ఈ వీడియో. ఒరిజినల్ కరెన్సీ నోట్లపై ఉండే సెక్యూరిటీ ఫీచర్ల గురించి తెలుసుకుంటే ఫేక్ కరెన్సీని ఈజీగా గుర్తించవచ్చు.

## ఓటర్లకు ప్రియాంక, రాహుల్ సూచన



**న్యూఢిల్లీ :** సార్వత్రిక ఎన్నికల తుది దశ పోలింగ్.. జూన్ 1వ తేదీన జరగనుంది. దీంతో ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పరిసమాప్తం కానుంది. ఆ క్రమంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు ప్రియాంక గాంధీ, రాహుల్ గాంధీ.. ఎవరికి వారు తమ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఆదివారం పంజాబ్‌లోని పతేఘర్ సాహెబ్‌లో ప్రియాంక గాంధీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మోదీ ప్రభుత్వంపై మాటలతో ఆమె దాడి చేశారు. దేశంలో 70 కోట్ల నిరుద్యోగ యువత ఉందన్నారు. గత 45 ఏళ్లలో ఇదే అత్యధికమని ఆమె గుర్తు చేశారు. అలాగే ఈ మోదీ ప్రభుత్వం హయాంలో 30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఇక ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ ప్రజా సమస్యలపై మాట్లాడడం లేదని మండిపడ్డారు. దేశంలో ప్రజా సమస్యలపై స్పందించే పార్టీ కాంగ్రెస్ పార్టీనేనని ఈ సందర్భంగా ప్రియాంక గాంధీ స్పష్టం చేశారు. అటు కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, ఇటు మణిపూర్ నుంచి మహారాష్ట్ర వరకు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేసి.. ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారని ప్రియాంక గాంధీ తెలిపారు. ఇక దేశంలో నగదు లేదని ప్రధాని మోదీ అంటుంటారని.. కానీ ప్రజల కోసం పథకాలు తీసుకు వస్తామని చెబుతారన్నారు. మరోవైపు తన బిలియనీర్ స్నేహితుల చేసిన రూ.16 లక్షల కోట్ల రుణాన్ని సైతం ప్రధాని మోదీ మాఫీ చేశారని ఈ సందర్భంగా ప్రియాంక గాంధీ గుర్తు చేశారు. అంటే నరేంద్ర మోదీ వద్ద ఉన్న నగదు బిలియనిర్ స్నేహితులకు ఇచ్చేందుకు ఉంటుంది కానీ.. రైతులకు ఇవ్వడానికి మాత్రం ఉండదని వ్యంగ్యంగా అన్నారు. ఈ నరేంద్ర మోదీ ప్రదానిగా.. రైతులకు, నిరుద్యోగులకు ఏం చేయాలని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో తుది దశ పోలింగ్ వేళ చాలా బాగా ఆలోచించి.. పార్టీ అభ్యర్థులకు ఓటు వేయాలని ఓటర్లకు ఈ సందర్భంగా ప్రియాంక గాంధీ సూచించారు. ఇక హిమాచల్‌ప్రదేశ్‌లోని నహన్‌లో ఆదివారం రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ రాష్ట్రం విపత్కర పరిస్థితుల్లో ఉందని.. ఈ విషయాన్ని మాత్రం బీజేపీ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో విపత్తు సంభవించిందని.. ఈ నేపథ్యంలో రూ. 9 వేల కోట్లు కావాలని మోదీ సర్కార్‌ను ఈ రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసినా.. స్పందించలేదని విమర్శించారు. రాజ్యాంగం ద్వారానే హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటైందని ఈ సందర్భంగా రాహుల్ గుర్తు చేశారు. అటువంటి రాజ్యాంగాన్ని రక్షించేందుకు నేడు యుద్ధం జరుగుతుందని ప్రజలకు రాహుల్ తెలిపారు. పంజాబ్‌లోని 13 లోక్‌సభ స్థానాలకు, హిమాచల్‌ప్రదేశ్‌లోని 4 లోక్‌సభ స్థానాలకు.. తుది దశ పోలింగ్ జూన్ 1వ తేదీన జరగనుంది.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్‌కు సర్వం సిద్ధం

-మొదటి పేజి తరువాయి

ఏర్పాటుచేసి సిబ్బందికి 32 రకాల పోలింగ్ సామాగ్రిని అందజేస్తున్నారు. పోలింగ్ స్టేషన్లకు జంబో, మిని బ్యాలెట్ బాక్స్‌లను తరలిస్తున్నారు. సాయంత్రంలోగా వారికి కేటాయించిన కేంద్రాలకు సిబ్బంది చేరుకోనున్నారు. సోమవారం ఉదయం 6 గంటలకు పోలింగ్ ఏజెంట్లను నియమించుకుని మాక్ పోలింగ్ నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభిస్తారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు చేశారు. పోలింగ్ ముగిసిన తర్వాత అన్ని బ్యాలెట్ బాక్సులు నల్లగొండలోని దుప్పలపల్లి వేర్ హౌసింగ్ గౌడన్స్‌కు చేరుకోనున్నాయి. జూన్ 5న ఓట్లను లెక్కిస్తారు.

పోలింగ్ రోజు ఉదయం 6 నుంచి రాత్రి 8గంటల వరకు 144 సెక్షన్ అమలు చేయనున్నారు. 48 గంటలపాటు వైన్ షాపులు బంద్ చేశారు.

**ఓటు ప్రాధాన్యత తెలుపడం ఎలాగో తెలుసా..?**

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం 52మంది బరిలో ఉన్నారు. జంబో బ్యాలెట్ పేపర్‌తో పోలింగ్ నిర్వహించనున్నారు ఎన్నికల అధికారులు. మొత్తం 4లక్షల 63వేల 839 మంది ఓటర్లు ఉండగా, ఉమ్మడి వరంగల్



జిల్లాలో లక్షా 73వేల 406మంది, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో లక్షా 23వేల 985, ఉమ్మడి నల్గొండ జిల్లాలో లక్షా 66వేల 448 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారు. 605 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో 34 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. పోలింగ్ డే రోజు ఈ మూడు జిల్లాల్లో ప్రత్యేక సెలవు ప్రకటించారు. అధికారులు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద పోలింగ్ సామాగ్రి పంపిణీ చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. రేపు జరిగే పోలింగ్ కు అధికార యంత్రాంగం చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రచారం ముగించిన అభ్యర్థులు ఇక పట్టభద్రుల ఆశీస్సుల కోసం ఎదురు చూస్తున్నారు. విద్యావంతుల ఓటు ప్రాధాన్యత తెలుపడం ఎలాగో తెలుసా..?

అయితే సాధారణ ఎన్నికలతో పోల్చితే పట్టభద్రుల పోలింగ్ కాస్త భిన్నంగా ఉంటుంది.. 52 మంది అభ్యర్థులు బరిలో నిలిచిన నేపథ్యంలో జంబో బ్యాలెట్ ద్వారా పోలింగ్ నిర్వహిస్తున్నారు. ఓటర్లు అభ్యర్థులకు అంకె ద్వారా వారి ప్రాధాన్యత తెలపాల్సి ఉంటుంది. ఒకటోవ ప్రాధాన్యత, రెండోవ ప్రాధాన్యత ఇలా వారికి నచ్చిన అభ్యర్థికి ప్రాధాన్యత క్రమంలో ఓటు వేయాల్సి ఉంటుంది. ఓటు వేసే క్రమంలో ఇంటూ గుర్తు, ఇతర సింబల్స్ రాయకూడదు. మొదటి ప్రాధాన్యత అయితే అక్కడ ఒక నిలువు గీత మాత్రమే పెట్టి వారి ప్రాధాన్యత తెలపాలి. పోలింగ్ బూత్‌లో ఇచ్చిన పెన్ను మాత్రమే వాడాలి. కాదని ఎలాంటి ప్రయోగాలు చేసిన మీ ఓటు బురదలో వేసినట్లే అవుతుందంటున్నారు ఎన్నికల సంఘం అధికారులు. సోమవారం 27వ తేదీ ఉదయం 8గంటల నుండి సా.4 వరకు పోలింగ్ జరుగుతుంది.. 48 గంటల పాటు మూడు జిల్లాల పరిధిలో మద్యం దుకాణాలు మూసి వేశారు. పోలింగ్ రోజు ఉ.6 నుండి సా.8 వరకు 144 సెక్షన్ అమలు చేస్తున్నారు.

# తెలంగాణలో కుంభకోణాల కుంభమేళా జరుగుతోంది

-మొదటి పేజి తరువాయి

వచ్చిన తర్వాత ధాన్యం కొనుగోలులో భారీ కుంభకోణం జరిగిందని సివిల్ సప్లైస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్ సింగ్ 15 రోజుల కిందట మొట్ట మొదటిసారి నిర్దిష్ట ఆరోపణలు చేశారని కేటీఆర్ తెలిపారు. దీనిపై ప్రభుత్వం నుంచి ఏ రకమైన స్పందన కూడా రాలేదన్నారు. వారం కిందట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కూడా ఈ ఆరోపణలను ఆధారాలతో బయటపెట్టారని చెప్పారు. దీనిపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గానీ.. సీఎం రేవంత్ రెడ్డి గానీ.. ఈరోజు వరకు ఈ కుంభకోణంపై పెద్దవి విప్పడం లేదని మండిపడ్డారు. అందుకే బీఆర్ఎస్ పార్టీ తరఫున నిర్దిష్టమైన ఆధారాలతో బయటపెడుతున్నామని తెలిపారు.

బీఆర్ఎస్ అంటే స్కీమ్‌లు.. కాంగ్రెస్ అంటే స్కామ్‌లు అని కేటీఆర్ పునరుద్ఘాటించారు. నిజానికి కాంగ్రెస్ అంటేనే స్కాం..గ్రెస్ అని అన్నారు. కాంగ్రెస్ వస్తే తెలంగాణలో కుంభకోణాల కుంభమేళా జరుగుతుందని ఎన్నికలకు ఆరు నెలల ముందు నుంచే చెబుతున్నామని గుర్తు చేశారు. గల్లీ మే లూటో.. ఢిల్లీ మే బాంటో.. అంటే గల్లీలో దోచుకో.. ఢిల్లీలో ఉండే కాంగ్రెస్ పెద్దలకు ఇచ్చుకో అన్నట్లుగా ఉందన్నారు. ఇవాళ రైతన్నల ధాన్యం నుంచి విద్యార్థుల అన్నం వరకు అన్నింటి మీద కుంభకోణాలకు కాంగ్రెస్ పార్టీ తెరలేపిందని అన్నారు. ధాన్యం కొనుగోలు పూర్తికాక.. కొనుగోళ్ల కేంద్రాల వద్ద రైతులు కన్నీళ్లు పెట్టుకుంటే.. ప్రభుత్వం మాత్రం ధాన్యం కొనుగోళ్లపై దృష్టి పెట్టకుండా.. ధాన్యం కుంభకోణంపై దృష్టిపెట్టారని అన్నారు. ముఖ్యమంత్రి పేషీ నుంచి పౌరసరఫరాల డిపార్ట్‌మెంట్ నుంచే ఈ కుంభకోణం జరిగిందని తమకు సమాచారం ఉందన్నారు. ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టడం.. కొంతమంది కాంట్రాక్టర్లకు దోచిపెట్టడం.. వాళ్లు వీళ్లు కలిసి సీక్రెట్‌గా దందా చేసి వెయ్యి కోట్లు కుంభకోణం చేశారని ఆరోపిపంచారు.

రాష్ట్రంలో బీ ట్యాక్స్ అని.. ఆర్ ట్యాక్స్ అని.. ఆర్ఆర్ ట్యాక్స్ అని.. యూ ట్యాక్స్ అని ట్యాక్స్‌ల గురించి వింటున్నామని అన్నారు. ఈ స్కాంలో మాత్రం కేవలం తెలంగాణలోని కాంగ్రెస్ పెద్దలకే కాకుండా ఢిల్లీ పెద్దల దాకా కూడా హస్తం ఉందని తమకు సమాచారం ఉందన్నారు. 1.67 కోట్ల మంది మహిళలకు వంద రోజుల్లో నెలకు రూ.2500 ఇస్తామన్నారు.. రాష్ట్రంలో 46 లక్షల మంది వృద్ధులకు 4వేలు పింఛన్లు ఇస్తామన్నారు.. ఆ ఫైలు కదలడం లేదు.. రైతులకు



రైతు భరోసా కింద రూ.15వేలు అన్నారు.. ఆ ఫైలు కదలడం లేదు. సంక్షేమ పథకాలపై మాట ఇచ్చిందో.. ప్రజల జేబులు నింపే పని చేతనైతలేదు గానీ.. కాంగ్రెస్ పెద్దలు మాత్రం తమ జేబులు నింపుకోవడంలో బిజీ బిజీగా ఉన్నారని విమర్శించారు.

**పౌర సరఫరా శాఖలో భారీ స్కాం..**

పౌర సరఫరాల శాఖలో జరిగిన భారీ కుంభకోణంలో సీఎం రేవంత్ రెడ్డి పాత్ర కూడా ఉండే అవకాశం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ స్కాంలో హైదరాబాద్ నుంచి ఢిల్లీ పెద్దల దాకా అనేక మంది హస్తం ఉందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. ఈ మొత్తం స్కాంలో బీజేపీ పాత్ర కూడా అనుమానాస్పదంగా ఉందన్నారు. బీజేపీ పార్టీ శాసనసభా పక్ష నేతనే స్వయంగా అవినీతి జరిగిందని చెబుతున్నా.. కేంద్ర ప్రభుత్వం ఇప్పటిదాకా ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ఈ మొత్తం వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ పాత్రపై కూడా తమకు అనుమానం వస్తుందని చెప్పారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ తరఫున పలు డిమాండ్లు చేశారు.

**ఇవే ఆ డిమాండ్లు..**

90 రోజుల టెండర్ గడువు ముగిసినా ధాన్యాన్ని లిఫ్ట్ చేయని ఏజెన్సీలపై వెంటనే చర్యలు తీసుకోవాలి. వాటిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలి. రైస్ మిల్లర్లు కొంటామని సుముఖత వ్యక్తం చేసినా అసలు టెండర్లు ఎందుకు పిలిచారు? దీనిపై శ్వేతపత్రం విడుదల చేయాలి. మా ప్రభుత్వంలో టెండర్లు పిలిచినా.. తక్కువ ధర వస్తే రద్దు చేశాం.. క్వింటాలుకు రూ.2100కి కొనేందుకు రైస్ మిల్లర్లే సిద్ధంగా ఉన్నప్పుడు అంత కంటే తక్కువ వస్తే ఏం లాభమని ఆ టెండర్లను రద్దు చేశాం.. కానీ రూ.2100 కంటే తక్కువ ధర వచ్చినా ఎందుకు టెండర్ ఆమోదించారు. బ్లాక్ లిస్ట్‌లో పెట్టిన సంస్థలను ప్రత్యేకంగా మినహాయింపు ఇచ్చారో చెప్పాలి. నిబంధనల ప్రకారం 90 రోజుల్లో లిఫ్టింగ్ జరగాలి. 20 శాతమే లిఫ్టింగ్ జరిగింది. ఇప్పుడు ఎక్స్‌టెన్షన్ ఇద్దామని చూస్తున్నారు. దానిపై ఎక్స్‌టెన్షన్ ఇవ్వకుండా.. టెండర్‌ను రద్దు చేయాలి. ఇప్పటివరకు ఏజెన్సీల బాధ్యత ధాన్యం సేకరణ మాత్రమే.. కానీ కాంట్రాక్ట్ దక్కించుకున్న సంస్థలు డబ్బుల వసూలులో ఉన్నారు. దీనికి ఎలా అనుమతి ఇచ్చారో సమాధానమివ్వాలి. అవసరమైతే ఎఫ్‌సీఐ కూడా దీనిపై ఈడీకి ఫిర్యాదు చేయాలి. మనీలాండరింగ్ జరిగింది కాబట్టి దీనిపై ఈడీ విచారణ జరపాలి. ధాన్యం లిఫ్ట్ చేయకుండా రూ.2236 చొప్పున చెల్లించాలని రైస్ మిల్లర్లను వేధిస్తున్న వ్యవహారం మనీలాండరింగ్ కిందకు వస్తుంది. ఇది పెద్ద కుంభకోణం. ఎఫ్‌సీఐ దీనిపై సీబీఐ, ఈడీకి ఫిర్యాదు చేయాలి. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఎఫ్‌సీఐ స్పందించాలి. లేకపోతే బీజేపీపై కూడా అనుమానాలు తలెత్తుతాయి. మీకు చిత్తశుద్ధి ఉంటే, మీ మంత్రి కడిగిన ముత్యమైతే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాళేశ్వరం, భద్రాద్రి విద్యుత్ కొనుగోళ్ల మాదిరిగా.. పౌరసరఫరాల శాఖలోని రెండు టెండర్లపై కూడా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని అన్నారు. ఎఫ్‌సీఐ, రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోయినా.. ఈవ్యవహారాన్ని వదిలిపెట్టమని తెలిపారు. ఆధారాలతో సహా న్యాయస్థానాలను ఆశ్రయించి న్యాయపోరాటం చేస్తామని చెప్పారు. ఏజెన్సీల ముందు పెడతామని తెలిపారు. తప్పకుండా ప్రజాక్షేత్రంలో వీళ్లను వదిలిపెట్టమని స్పష్టం చేశారు.

# బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కై మాట్లాడుతున్నారు

-మొదటి పేజి తరువాయి

కుమ్మక్కై మాట్లాడుతున్నారు" అని ఉత్తమ్ దుయ్యబట్టారు. సన్న బియ్యం మీరు ఎంత ఇస్తే అంతా కొంటాం అంటూ కేటీఆర్, మహేశ్వర్‌రెడ్డికి మంత్రి ఉత్తమ్ సవాల్ విసిరారు. సివిల్ సప్లైస్ రూ.11 వేల కోట్ల నష్టాల్లోఉంది. మిల్లర్లపై చర్యలు తీసుకుంటే అవినీతి ఆరోపణలు చేస్తున్నారు. నాపై నిరాధార ఆరోపణలు చేస్తే ఊరుకోను. ధాన్యం కొనుగోళ్లను గత ప్రభుత్వం కంటే ఎక్కువ చేశాం. మేం రైతులకు మేలు చేసే ప్రయత్నం చేస్తుంటే ప్రతిపక్షాలు అసత్యాలు ప్రచారం చేస్తున్నాయి"అని ఉత్తమ్ మండిపడ్డారు.

కేటీఆర్, మహేశ్వర రెడ్డి తెలిసి తెలియకుండా ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారు. బాధ్యత రాహిత్యమైన ఆరోపణలు చేస్తే ఊరుకోను. మిల్లర్ల దగ్గర డబ్బులు తీసుకోవడం కాదు కదా కనీసం వాళ్లని కలవలేదు.. నాలాంటి నిజాయితీ పరుడిపై ఇష్టం వచ్చినట్టు మాట్లాడడం సరైంది కాదు.. సన్నబియ్యం ఒక్క గింజ కూడా కొనలేదు.. 42 రూపాయలకు కిలో సన్న బియ్యం అమ్మితే ప్రభుత్వం వెంటనే కొంటుంది.. టెండర్‌లో ఉన్న కండిషన్స్‌కి ఒప్పుకుంటే ఎంత ధాన్యం అమ్మినా ప్రభుత్వం కొంటుంది. మిల్లర్లపై ఇంత కఠినంగా ఉన్న ప్రభుత్వం మాదే.. మిల్లర్లలో తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటున్నాం" అని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. డిఫాల్టర్ రైస్ మిల్లర్ల కోసమే బీఆర్ఎస్, బీజేపీ మాట్లాడుతోంది.. మిల్లర్ల పై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని విమర్శిస్తున్న వాళ్ళే మిలర్లను ఇబ్బందులు పెడుతున్నారని అంటున్నారు. ఢిల్లీకి డబ్బులు పంపి ఫ్లోర్ లీడర్ పదవి మహేశ్వర్ రెడ్డి కొనుక్కున్నారు. బయట ధాన్యం గురించి మాట్లాడి లోపల భూముల విషయం మాట్లాడే సంస్కారం మాది కాదు. మహేశ్వర రెడ్డిని మేమే పెంచి పోషించాం. మహేశ్వర రెడ్డి అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నాడు" అంటూ ఉత్తమ్ దుయ్యబట్టారు.

"కిషన్‌రెడ్డిని ఓవర్ టేక్ చేయాలని మహేశ్వర రెడ్డి భావిస్తున్నారు. పార్టీలో ఓవర్ స్పీడ్‌గా పోవాలని మహేశ్వర



రెడ్డి అనుకుంటున్నాడు. సన్న ధాన్యానికి గత ప్రభుత్వంలో 1700 వచ్చింది. ఇప్పుడు 2400 వస్తోంది. మిల్లర్లపై గత ప్రభుత్వం బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తే ఇప్పుడు ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదు" అని ఉత్తమ్ చెప్పారు.

సివిల్ సప్లయ్ కార్పొరేషన్‌లో గత ప్రభుత్వం చేసిన అప్పులు రూ.11వేల కోట్లని అన్నారు. గత ప్రభుత్వం కంటే తామే ముందుగా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించామని తెలిపారు.తడిసిన ధాన్యాన్ని ఎమ్మెస్పీ ధరకు కొనాలని విప్లవాత్మక స్టెప్ తీసుకున్నామన్నారు.అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఎమ్మెస్పీ ధరకు కొన్న ఏకైక ప్రభుత్వం తమదేనని స్పష్టం చేశారు. డిఫాల్టర్ రైస్ మిల్లర్ల కోసమే బీఆర్ఎస్, బీజేపీ మాట్లాడుతోందన్నారు.మిల్లర్లపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని విమర్శిస్తున్న నేతలే మిలర్లను ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. బయట ధాన్యం గురించి మాట్లాడి లోపల భూముల విషయం మాట్లాడే సంస్కారం తమది కాదన్నారు. మిల్లర్ల దగ్గర డబ్బులు తీసుకోవడం కాదు కదా కనీసం వాళ్లని తాను కలవలేదని తేల్చిచెప్పారు.తనలాంటి నిజాయితీ పరుడిపై ఇష్టం వచ్చినట్టు మాట్లాడడం సరైంది కాదన్నారు.సన్నబియ్యం ఒక్క గింజ కూడా కొనలేదన్నారు. రూ. 42 రూపాయలకు కిలో సన్న బియ్యం అమ్మితే ప్రభుత్వం వెంటనే కొంటుందని తెలిపారు.టెండర్లో ఉన్న కండిషన్స్‌కి ఒప్పుకుంటే ఎంత ధాన్యం అమ్మినా ప్రభుత్వం కొంటుందని స్పష్టం చేశారు.మిల్లర్లపై ఇంత కఠినంగా ఉన్న ప్రభుత్వం తమదేనని చెప్పుకొచ్చారు. మిల్లర్లలో తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## హైదరాబాద్ వాసులకు అలెర్ట్..

-మొదటి పేజి తరువాయి



అంబర్ పేట్ ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. పలు ప్రాంతాల్లో రోడ్లు జలమయం కావడంతో ట్రాఫిక్ కు ఇబ్బందులు ఎదురయ్యాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. రెమాల్ తుఫాన్ వల్ల తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు పడుతాయని వాతావరణ శాఖ హెచ్చరించిన విషయం తెలిసిందే. నేడు(ఆదివారం) మధ్యాహ్నం ఒక్కసారిగా మేఘావృతమే పలు ప్రాంతాల్లో భారీ వాన పడింది. నగరంలోని అంబర్‌పేట, కాచిగూడ, నల్లకుంట, ఉప్పల్, నాగోల్, మన్సూరాబాద్, మల్కాజిగిరి, తుర్కయంజాల్ తదితర ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది.

ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, పెద్దఅంబర్‌పేట్ అబ్దుల్లాపూర్‌మెట్‌లో భారీ ఈదురుగాలులతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వనస్థలిపురంలో ఈదురు గాలులకు గణేశ్ దేవాలయం ప్రాంగణం, ఎన్జీవోస్ కాలనీ ప్రధాన రహదారిపై, రైతు బజార్ సమీపంలో పార్కు వద్ద భారీ చెట్లు నేలకొరిగాయి. సకాలంలో జీహెచ్ఎంసీ సిబ్బంది చేరుకుని రహదారిపై పడిన చెట్లను తొలగిస్తున్నారు.

**మేడ్చల్ జిల్లాలో ఇద్దరి మృతి**

కాగా.. మేడ్చల్ జిల్లాలోని కీసర మండలంలో ఈదురుగాలులు, భారీ వర్షానికి తిమ్మాయిపల్లి– శామీర్‌పేట్ దారిలో చెట్టు కూలి ఇద్దరు ప్రయాణికులు మృతి చెందారు. ద్విచక్రవాహనంపై చెట్టు విరిగిపడటంతో నాగిరెడ్డి రామ్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందరు. మరో వ్యక్తి ధనుంజయకు తీవ్రగాయాలయ్యాయి. ఆయనను చికిత్స నిమిత్తం ఈసీఐఎల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతులను యాదాద్రి జిల్లా బొమ్మలరామారం మండలం ధర్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. మరోవైపు పడమర, వాయువ్య దిశల్లో తక్కువ ఎత్తులో గాలులు వీస్తున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. శనివారం ఆగ్నేయ రాజస్థాన్‌లో ప్రారంభమై మధ్యప్రదేశ్, విదర్భ మీదుగా తెలంగాణ వరకు సముద్రమట్టానికి 0.9కి.మీ ఎత్తులో కొనసాగిన ద్రోణి ఈరోజు బలహీనపడింది.ఈ కారణంగానే రాష్ట్రంలో ఈదురు గాలులు వీస్తున్నాయి. అయితే నైరుతి రుతుపవనాలు నైరుతి, ఈశాన్య బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాలకు విస్తరించాయని వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రంలో రాగల మూడు రోజులు కాస్త పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని చెప్పారు. పగటి పూట ఉష్ణోగ్రతలు క్రమేపీ రెండు నుంచి మూడు డిగ్రీలు అధికంగా నమోదయ్యే సూచనలున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

## కాంగ్రెస్ కొత్త సారథి ఎవరు?

-మొదటి పేజి తరువాయి

భట్టి విక్రమార్క కూడా టీపీసీసీ చీఫ్ రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో కర్ణాటక ఎన్నికల్లో ముఖ్యమంత్రి పదవి సిద్దరామయ్యకు కేటాయించే తరుణంలో డిప్యూటీ సీఎంతో పాటు కర్ణాటక అధ్యక్షుని పదవీ బాధ్యతలు కూడా డీకే శివకుమార్‌కు కేటాయించిన సందర్భాన్ని గుర్తు చేస్తున్నారు. అయితే ఈ పదవిపై జగ్గారెడ్డి కూడా గంపెడు ఆశలు పెట్టుకున్నారు. ఆయన ఇప్పటికే ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన తరుణంలో ఏదైనా పార్టీ బాధ్యతలు కేటాయించాలన ఆశగా ఉన్నారు. అందులో భాగంగానే ఈ అధ్యక్షపదవిని ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే ఈ జాబితాలో వినిపిస్తున్న మరో పేరు పొన్నం ప్రభాకర్. ఈయనకు ప్రస్తుతం తెలంగాణ క్యాబినెట్‌లో స్థానం కల్పించారు. అయితే తాను స్టూడెంట్ యూనియన్ లీడర్ గా ఉన్నప్పటి నుంచే ఈ పార్టీని నమ్ముకుని పనిచేస్తున్నానని అందుకే అధ్యక్షుని బాధ్యతలు కేటాయిస్తే పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని అధిష్టానానికి తెలిపినట్లు సమాచారం.

ఇలా కాకుండా బీసీ, ఎస్సీ సామాజిక వర్గానికి ఈ పదవి ఇవ్వాలని అధిష్టానం ఆలోచిస్తే.. మధుయాష్కీ గౌడ్ పేరు కూడా బలంగా వినిపిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తో పాటు ఏఐసీసీ సెక్రటరీ సంపత్‌కుమార్ కూడా ఈ పదవి కోసం ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. పైగా బీసీలకు కాంగ్రెస్ పెద్దపీట వేస్తామని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీ కులగణన చేస్తామని చెప్పిన మాటపై కట్టుబడి ఉండేందుకు ఈ పదవిని బీసీ నాయకుడికి ఇచ్చే ఆలోచనలో కూడా ఉన్నట్లు సమాచారం. అయితే ఇలా ఎవరికి వారే కీలక నేతలు తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షపదవిపై ఆశలు పెట్టుకోవడంతో ఈ సీటు ఎవరికి వరిస్తుందా అన్న ఉత్కంఠ రాజకీయ వర్గాల్లో నెలకొంది. లోక్ సభ ఎన్నికల ఫలితాల తరువాత దీనిపై కాంగ్రెస్ అధిష్టానం ఒక నిర్ణయం తీసుకుని స్పష్టమైన ప్రకటన వెలువరిచే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో చర్చించుకుంటున్నారు.ల


## ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఓ దారితప్పిన పోలీసు...

## కేసీఆర్, కేటీఆర్ ల వ్యూహాలను అమలు చేస్తున్నారు

**కొల్లాపూర్ లో బీఆర్ఎస్ కార్యకర్త శ్రీధర్ రెడ్డి హత్య**

**కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం**

**ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపణలకు బదులిచ్చిన మల్లు రవి**



కొల్లాపూర్ లో శ్రీధర్ రెడ్డి అనే బీఆర్ఎస్ కార్యకర్త హత్య నేపథ్యంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఈ నేపథ్యంలో, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పై కాంగ్రెస్ నేత మల్లు రవి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కొల్లాపూర్ లో శ్రీధర్ రెడ్డి హత్య వెనుక నిజానిజాలు తేల్చేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందని మల్లు రవి స్పష్టం చేశారు. కొల్లాపూర్ లో బుల్డోజర్లతో ఇళ్లు కూల్చేస్తున్నారంటూ ప్రవీణ్ కుమార్ పిచ్చెక్కినవాడిలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ప్రవీణ్ కుమార్ గతంలో అనంతపురం ఎస్పీగా ఉన్నప్పుడే పరిటాల రవి హత్య జరిగిందని, కరీంనగర్ ఎస్పీగా ఉన్నప్పుడు బడుగు బలహీన వర్గాల పిల్లలను కాల్చి చంపిన చరిత్ర ప్రవీణ్ కుమార్ ది అని మల్లు రవి నిప్పులు చెరిగారు. ఇదేమైనా కల్లోలభరిత ప్రాంతాల్లో ఎన్ కౌంటర్లు చేసినట్టు అనుకుంటున్నావా? వాస్తవ పరిస్థితులు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. ప్రవీణ్ కుమార్ గతంలో ఐపీఎస్ అధికారిగా పనిచేశారని, కానీ ఇప్పుడాయన దారితప్పిన పోలీసులా మాట్లాడుతున్నారని మల్లు రవి విమర్శించారు. నాడు కేసీఆర్ ఆదేశాలతోనే ప్రవీణ్ కుమార్ బీఎస్పీలో చేరారని, ఇప్పుడు కూడా కేసీఆర్, కేటీఆర్ ల వ్యూహాలను అమలు చేస్తున్నారని ఆరోపించారు.

## మార్పుకు అడ్డొస్తే సహించం

**హైదరాబాద్:** బీఆర్ఎస్, బీజేపీ రెండు పార్టీలు కలిసినా సీట్లు రావట్లేదనే అక్కసుతో అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ప్రతిపక్షాల విమర్శలకు ప్రభుత్వ పనితీరే సమాధానం చెబుతోందన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో కంటే తమ ప్రభుత్వం అభివృద్ధిలో మార్పు తెస్తుందని... మార్పుకు అడ్డ వస్తే సహించేది లేదని వార్నింగ్ ఇచ్చారు. ఆదివారం గాంధీభవన్‌లో మంత్రి శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడుతూ.. అబద్దాలను ప్రచారం చేస్తే బీఆర్ఎస్ పార్టీ కనుమరుగు అవుతుందని చెప్పారు. వారిలో కూడా మార్పు తెచ్చే ప్రయత్నం చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వ పొరపాట్లను తాము ఏం చేయమన్నారు.గత ప్రభుత్వాన్ని సలహాలు, సూచనలు ఇవ్వమని చాలాసార్లు కోరామని.. వారు ఎలాంటి సలహాలు ఇవ్వలేదని చెప్పారు. తమ ప్రభుత్వం అత్యంత ప్రజాస్వామికంగా ఉందన్నారు. ప్రజలకు ఇస్తున్న పథకాలను కేసీఆర్, కేటీఆర్, హరీష్ పక్కతోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో... ఎంజీఎం హాస్పిటల్లో గత ఏడాది121 సార్లు కరెంట్ బ్రేక్ డౌన్ అయిందన్నారు.ఎంజీఎం హాస్పిటల్లో ఎలుకలు పేషంట్ చర్మాన్ని తిన్నాయని గుర్తుచేశారు. గత ప్రభుత్వం సివిల్ సప్లయ్ శాఖలో అడ్డగోలుగా అప్పులు చేశారని మంత్రి శ్రీధర్ బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కంబాలపల్లిలో అంగరంగ వైభవంగా బీరప్ప జాతర






**వాస్తవ నేస్తం,సంగారెడ్డి:** కంబాలపల్లి గ్రామంలో జరుగుతున్నటువంటి బీరప్ప జాతర మహోత్సవములో భాగంగా ఆదివారం సామూహికంగా బోనాలు గ్రామ కురుమ సంగమ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా బీర్ల వాళ్ళు వివిధ నృత్యాలతో ఒగ్గు కళాకారులు డోలు దెబ్బలతో నృత్యాలు చేస్తూ యువత కేరింతలు కొడుతూ శివసత్తులు పూనకాలు యువత ఆటపాటలా డుతూ కేరింతలు కొడుతూ గ్రామ ప్రజలు అందరూ బోనాలతో పురవీధుల్లో తిరుగుతూ సంతోషాలతో ఆడుకుంటూ బోనాలు తీశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ పెద్దగొల్ల శ్రీహరి గ్రామ కురుమ సంఘం అధ్యక్షులు శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి కృష్ణ, మాజీ ఎంపీపీ పెద్దగొల్ల మల్లమ్మ, మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పెద్దగొల్ల ఆంజనేయులు, ఉప సర్పంచ్ సుభాష్, మాజీ ఉపసర్పంచ్ జానీ మియా, మాజీ స్కూల్ చైర్మన్ కాజా మియా, పత్తి గారి విట్టల్, భూషణం, వీరయ్య, సుభాష్, మల్లేశం, పాండు రవి, వెంకటేశం, రాజు, చిన్న రాజేందర్, అన్నంతి కిషోర్, పాండు నాగయ్య, జంగయ్య, ప్రభాకర్, ఎంఆర్ఎఫ్ రాములు, రాకేష్, దుర్గేష్, చీమలదరి మల్లేశం, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# పాత ఫైళ్లతో డబ్బులు డ్రా చేసిందెవరు?

**బల్దియాలో ఇంటెలిజెన్స్ పోలీసుల ఆరా**
**కాంట్రాక్టర్లకు అధికారుల మధ్య వారధిపై విచారణ**
**పలువురు ఉద్యోగుల తీరుపై సమాచార సేకరణ**
**200 ఎంబీ బుక్స్ విషయంలో కూపీ లాగుతున్న అధికారులు**



**వరంగల్ :** గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ కమిషనర్ పేషీలో ఓ ఉద్యోగి పాత ఫైళ్ల (ఎంబీ బుక్కు)పై బదిలీపై వెళ్లిన కమిషనర్ సంతకాలతో డబ్బులు డ్రా చేసిన వైనంపై ఇంటెలిజెన్స్ పోలీసులు దృష్టి సారించారు. ఈ తతంగంపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'పాత ఫైళ్లపై బిల్లులు' అనే కథనం ప్రచురించింది. ఈ క్రమంలో విషయం తెలుసుకున్న ఇంటెలిజెన్స్ అధికారులు నాలుగురోజులుగా కూపీ లాగుతున్నారు. నిఘా వర్గాలు బుధవారం నుంచి రంగంలోకి దిగి శనివారం రాత్రి వరకు బల్దియాలోని పలు విభాగాల్లో రహస్య సేకరణ చేశారు. ముందుగా ఇంటెలిజెన్స్ జిల్లా ఉన్నతాధికారి నుంచి ఇంటెలిజెన్స్ ఇన్‌స్పెక్టర్, ఒక ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు ఒక లెటర్ తెచ్చి బల్దియా అధికారులకు ఇచ్చి వివరాలు కావాల్సిందిగా కోరారు. అయినా బల్దియా అధికారులు కాలయాపన చేస్తున్నట్టు సమాచారం. అయినా నిఘా వర్గాలు రహస్యంగా వివరాలు సేకరించినట్టు విశ్వసనీయ సమాచారం. తప్పుడు మార్గంలో డబ్బులు దండుకుని పాత కమిషనర్ సంతకాలు చేయించిన 200 ఎంబీ (మెజర్‌మెంట్ పుస్తకం) ఎవరి వద్ద ఉన్నాయి? అవి సంతకాలు చేయించి తీసుకుని వచ్చి ఇంజనీరింగ్, డీబీ(డ్రాయింగ్ బ్రాంచి) నుంచి గ్రీన్ సిగ్నం ఇప్పించింది ఎవరు? అనే కోణంలో ఆరా తీస్తున్నారు. ఇంకా ఇంటెలిజెన్స్ అధికారులు ఒక ఆడుగు ముందుకు వేసి నక్కలగుట్ట, కాశిబుగ్గ, కాజీపేటలో పనిచేస్తున్న ఇద్దరు ఏఈలను, ఒక డీఈతో పాటు 6గురు డీబీ అధికారులను విచారించి వివరాలు సేకరించినట్టు తెలిసింది. వారు నలుగురు బడా కాంట్రాక్టర్లకు మాత్రమే బిల్లులు చేశామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే పని చేసినట్టు వెల్లడించినట్టు విశ్వసనీయ సమాచారం. 200 ఎంబీ బుక్కులు దొరికేంత వరకు సమస్య ఝఠిలంగానే ఉంటుందని, సేకరించిన వివరాలను రాష్ట్ర అధికారులకు పంపించినట్టు అధికారులు తెలిపారు.

**ప్రధాన పాత్రధారి కోసం వేట**

బల్దియాలో కాంట్రాక్టర్లకు, ఇంజనీరింగ్ అధికారులకు, డీబీ సిబ్బందికి మధ్య సమన్వయకర్తగా వ్యవహరించిన వ్యక్తి పూర్తి వివరాలపై ఇంటెలిజెన్స్ అధికారులు కూపీ లాగుతున్నారు. కాంట్రాక్టర్ల నుంచి ఒక్కో ఎంబీకి రూ.10 నుంచి 20వేలు తీసుకుని అడ్డదారిలో ఎంబీ పుస్తకాలపై సంతకాలు చేయించినట్టు తెలుసుకున్నారు. అలాగే తన సామాజికవర్గానికి చెందిన ఉన్నతాధికారుల అండదండలతోనే తన సామాజికవర్గానికి చెందిన కాంట్రాక్టర్లకు, డబ్బులు ఇచ్చిన వారికి ఎంబీలపై సంతకాలు చేయించినట్టు తెలిసింది. అయితే సదరు వ్యక్తి గతంలో ఎక్కడ పని చేశాడు? ఇతడికి బల్దియాలో ఎవరు సహకరిస్తున్నారు? 200 ఎంబీ బుక్కులు ఎవరి వద్ద ఉన్నాయి? అనే కోణంలో ఆరాతీస్తున్నారు.

## సిరిసిల్లలో నకిలీ గల్ఫ్ ఏజెంట్లపై పోలీసులు కొరడా.. ముగ్గురిపై కేసు నమోదు




సిరిసిల్ల జిల్లాలో నకిలీ గల్ఫ్ ఏజెంట్లపై పోలీసులు కొరడా ఝుళిపించారు. నకిలీ వీసాలతో మోసం చేస్తున్న గల్ఫ్ ఏజెంట్లపై జిల్లా వ్యాప్తంగా శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. ముగ్గురు నకిలీ ఏజెంట్లపై కేసులు నమోదు చేశారు. ఈ వివరాలను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ వెల్లడించారు. తంగళ్లపల్లి మండలం సారంపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ మహబూబ్ (53), రుద్రంగికి చెందిన బొండు అంజయ్య (55), గంభీరావుపేట మండలం నిర్మాల గ్రామానికి చెందని ఓరుగంటి రాములు (39)పై కేసులు నమోదు చేశామని ఎస్పీ అఖిల్ మహాజన్ వెల్లడించారు. విదేశాల్లో ఉద్యోగాల కోసం వెళ్లే వారిని నికలీ వీసాలతో మోసం చేస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు. ఈ ఏడాది 19 కేసుల్లో నకిలీ ఏజెంట్లను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. నకిలీ ఏజెంట్లను నమ్మి మోసపోవద్దని సూచించారు. నకిలీ ఏజెంట్ల చేతిలో మోసపోయిన వారు నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. విచారణ జరిపి నేరం రుజువైతే వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

## కిలోమీటర్ ప్రయాణానికి 45 నిమిషాలు

**జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 45లో పరిస్థితి**
**ప్రత్యక్ష నరకం చూసిన వాహన చోదకులు**



**హైదరాబాద్:** ఒక్క అడుగు ముందుకు కదలాలంటే ఐదు నిమిషాలు.. కిలోమీటర్ ప్రయాణానికి ఏకంగా 45 నిమిషాల సమయం. ఇదీ జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు45లోని వాహన చోదకుల పరిస్థితి. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం కొత్త సంస్కరణల పేరిట పోలీసులు కాలాయాపన చేస్తున్నారు తప్పితే ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నదానికి శనివారం ఇక్కడ వాహన చోదకులు అనుభవించిన ప్రత్యక్ష నరకమే ఉదాహరణ. శనివారం రోడ్డు నంబరు 45లో ఓ మంచినీటి ట్యాంకర్‌కు సమస్య తలెత్తి రోడ్డు మీదే నిలిచిపోయింది. దీంతో వెనుకాల వస్తున్న వాహనాలు నెమ్మదించాయి. అరగంట తరువాత స్పందించిన పోలీసులు ప్రత్యామ్నాయదారుల్లో ట్రాఫిక్‌ను మళ్లించారు. కానీ, అప్పటికే అలస్యం అయిపోయింది. ట్రాఫిక్ జాం నెలకొనడంతో సుమారు రెండు గంటల పాటు వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు. అయితే ఈ ప్రభావం సాయంత్రం వరకు కొనసాగింది. దీనికి తోడు సీఎం రేవంత్‌రెడ్డి ఇదే సమయంలో కమాండ్ కంట్రోల్ సందర్శనకు వెళ్లారు. సీఎం రాకపోకలతో మరో అరగంటపాటు ట్రాఫిక్‌ను నిలిపివేశారు. దీంతో వాహన చోదకులు ప్రత్యక్ష నరకాన్ని చవిచూశారు. రోడ్డు నంబరు 45 నుంచి కిలో మీటరు దూరంలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ రోడ్డుకు రావడానికి 45 నిమిషాలకు పైనే పట్టిందని వాహనచోదకులు తెలిపారు.

## కరీంనగర్ శోభాయాత్రలో ఉద్రిక్తత.. ఆరుగురు హనుమాన్ భక్తులపై కేసు నమోదు



కరీంనగర్‌లో హనుమాన్ శోభాయాత్ర సందర్భంగా జరిగిన గొడవను పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని.. హనుమాన్ భక్తులపై కేసు నమోదు చేశారు. ఇప్పటివరకు ఆరుగురు భక్తులపై కరీంనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. గొడవ జరిగిన ప్రాంతంలో సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

**అసలేం జరిగిందంటే..**

కరీంనగర్‌లో హనుమాన్ దీక్ష స్వాములు శనివారం రాత్రి శోభాయాత్ర నిర్వహించారు. ఈ ర్యాలీ ప్రశాంత్‌నగర్ హనుమాన్ టెంపుల్ వద్దకు రాగానే మద్యం మత్తులో ఉన్న ఓ యువకుడు అందులోకి దూరాడు. కత్తితో డ్యాన్స్ చేస్తూ వీరంగం సృష్టించాడు. దీంతో ఆగ్రహించిన హనుమాన్ భక్తులు సదరు యువకుడి అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఆ యువకుడికి, హనుమాన్ భక్తులకు మధ్య మొదలైన వాగ్వాదం కాస్త ఘర్షణకు దారితీసింది. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని మద్యం మత్తులో ఉన్న యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అతన్ని పోలీస్ వాహనంలో ఎక్కించుకుని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లే ప్రయత్నం చేయగా, హనుమాన్ భక్తులు అడ్డగించేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఓ హనుమాన్ భక్తులు పోలీసు వాహనాన్ని గట్టిగా పట్టుకుని ఉండగా.. పోలీసులు వాహనాన్ని అలాగే స్పీడ్‌గా తీసుకెళ్లారు. ఓ హనుమాన్ భక్తుడు వాహనాన్ని పట్టుకుని అలాగే వేలాడుతూ ఉండిపోయాడు. వాహనం కొద్ది దూరం వెళ్లాక ఆపారు. ఆ తర్వాత వాహనాన్ని అడ్డుకున్న భక్తులను పోలీసులు చెదరగొట్టారు. ఈ క్రమంలో ఆందోళనకు దిగిన కొందరు భక్తులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల తీరుపై హనుమాన్ భక్తులు ఆందోళనకు దిగారు. త్రీటౌన్ పోలీస్ స్టేషన్ ముట్టడికి యత్నించారు. వారికి బీజేపీ నేతలు మద్దతుగా వెళ్లారు. పోలీసులు వారిని చెదరగొట్టేందుకు లాఠీచార్జి చేయడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. అర్ధరాత్రి వరకు పరిస్థితి ఇలాగే కొనసాగింది. కాగా, హనుమాన్ శోభాయాత్రలో కత్తి తిప్పిన వ్యక్తిని జయదేవ్‌గా గుర్తించారు. అతను బీజేపీ నాయకుడు బాస సత్యనారాయణకు అనుచరుడు, బీజేపీ కార్యకర్త అని తెలిసింది.

## నల్గొండ జిల్లాలో పట్టాలు తప్పిన గూడ్స్ రైలు.. ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపివేత



గుంటూరు సికింద్రాబాద్ మార్గంలో గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. నల్గొండ జిల్లా దామచర్ల మండలం విష్ణుపురం వద్ద గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. దీంతో అధికారులు ఆ మార్గంలో వస్తున్న శబరి ఎక్స్‌ప్రెస్ రైలు మిర్యాలగూడలో నిలిపివేశారు. అలాగే జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు పిడుగురాళ్లలో నిలిపివేస్తూ నిర్ణయం తీసుకున్నది. అయితే, గూడ్స్ రైలు పట్టాలు తప్పడానికి కారణాలు తెలియరాలేదు. సమాచారం అందుకున్న అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ జరుపుతున్నారు. ఘటనకు సంబంధించి ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## భద్రాచలంలో భారీగా గంజాయి పట్టివేత



**హైదరాబాద్ :** భద్రాచలంలో భారీగా గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. గంజాయిని తరలిస్తున్నారనే సమాచారం మేరకు కూనవరంలోని ఆర్టీఏ ఆఫీస్ సమీపంలో తనిఖీలు చేప ట్టారు. రెండు వాహనాల్లో తరలిస్తున్న 472 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని మోతుగూడెం, సుకుమామిడి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా తనిఖీలు చేపట్టి పెద్ద మొత్తంలో గంజాయిని పట్టుకున్నారు. ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## తెలంగాణలో గుట్కా తయారీ, అమ్మకంపై నిషేధం



**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆరోగ్యానికి హానికరమైన గుట్కాను నిషేధించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గుట్కా తయారీ, అమ్మకాలపై నిషేధం విధిస్తూ ఫుడ్ సేఫ్టీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది మే 24 నుంచి ఏడాది కాలం పాటు ఈ నిబంధనలు అమల్లో ఉంటాయని స్పష్టం చేశారు. గుట్కా, పాన్ మాసాలలో ఆరోగ్యానికి హాని కలిగించే పొగాకు, నికోటిన్ ఉండడం మూలంగానే వాటిని నిషేధించినట్లు పేర్కొన్నారు. గుట్కాను తయారు చేసినా, నిల్వ ఉంచినా, విక్రయాలు జరిపినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

## హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చేందుకు కుట్ర..




**హైదరాబాద్:** హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా (యూటీ) మార్చేందుకు కుట్రలు జరుగుతున్నాయని జల్‌పల్లి మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు షర్ఫుద్దీన్ హమేదీ పేర్కొన్నారు. నగరాన్ని యూటీ చేస్తే హైదరాబాద్ మనకు దక్కదని ఆందోళన వ్యక్తంచేశారు, హైదరాబాద్ లేని తెలంగాణ.. తల లేని మొండెంలాంటిదన్నారు. ఆదివారం ఎర్రకుంటలోని ఆయన కార్యాలయంలో మీడియాతో షర్ఫుద్దీన్ మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికలో.. ప్రశ్నించే గొంతుకనే గెలిపించాలన్నారు. కాంగ్రెస్ నిజ స్వరూపం ఆరు నెలల్లోనే బయటపడిందన్నారు. ఆరు నెలలు అయినా ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు విమర్శించారు. నిరుద్యోగ భృతి విషయంలో అడిగితే.. హామీనే ఇవ్వలేదని కాంగ్రెస్ చేతులెత్తేసిందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఓడిస్తేనే కాంగ్రెస్‌కు కనువిప్పు కలుగుతుందని అన్నారు. ఖమ్మం జిల్లాలోని 5 మండలాలను ఏపీకి బీజేపీ అప్పగించిందని గుర్తుచేశారు. ఇప్పుడు హైదరాబాదును యూటీ చేసేందుకు కాంగ్రెస్, బీజేపీ కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలో వచ్చినప్పటినుంచి బీఆర్ఎస్ నాయకులపై దాడులు పెరిగి పోయాయాని కొల్లాపూర్‌లో బీఆర్ఎస్ నాయకుల హత్యలు కాంగ్రెస్ దివాళాకోరుతనానికి నిదర్శనమ్మన్నారు. కాంగ్రెస్ పార్టీ తమ పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు.

## జూపార్కు నిర్వహణ, వన్యప్రాణుల సంరక్షణ భేష్




**హైదరాబాద్:** జూపార్కు నిర్వహణ, వన్యప్రాణుల సంరక్షణ చర్యలు అద్భుతంగా ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ అన్నారు. శనివారం ఆయన తన కూతురు, అటవీశాఖ ప్రభుత్వ న్యాయవాది షాజియా పర్వీన్ కుటుంబ సభ్యులతో కలిసి జూపార్కును సందర్శించారు. వారికి క్యూరేటర్ డాక్టర్ సునీల్ ఎస్.హిరెమత్ స్వాగతం పలికారు. అనంతరం జూ నిర్వహణ, జంతువుల సంరక్షణ, జంతువుల పునరుత్పత్తి, దత్తత తదితర విషయాలను వివరించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి సఫారీ పార్కు, పెద్దపులులు, నిశాచర జంతువుల ఎన్‌క్లోజర్లను పరిశీలించారు. అనంతరం షబ్బీర్ అలీ, షాజియా పర్వీన్ మాట్లాడుతూ జూపార్కు సహజసిద్ధంగా ఉందని, సందర్శకులకు వినోదంతోపాటు విజ్ఞానం కూడా అందుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ క్యూరేటర్ ఎ.నాగమణి, డిప్యూటీ డైరెక్టర్ (వెటర్నరీ) డాక్టర్ ఎం.ఎ హకీమ్, అసిస్టెంట్ క్యూరేటర్లు ఎ.సతీష్ బాబు, బి.లక్ష్మణ్, జూ సార్జంట్ ఎంఏ రహీమ్, ప్రజా సంబంధాల అధికారి హనీఫుల్లా తదితరులు పాల్గొన్నారు.


Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com